

# మ్యూజికల్ మ్యూజింగ్స్



- కస్తూరి మురళీకృష్ణ

**ఠండీ హవాయే లహరాకే ఆయే**

**రుత్ హై జవాన్, తుం కోయహాన్, కైసేబులాయే.**

ఎండాకాలం కొలిమిలా మండిస్తున్నా, వడగాడ్పుల నడుమ ఈ పాట వింటూంటేనే చల్లదనం ఎదను తాకుతుంది. మండుటెండులో కూడా శీతల పవనం శరీరాన్ని స్పృశించిన భావన కలుగుతుంది. సంగీతం గొప్పదనం అది. లతా మంగేష్కర్ స్వరంలో అత్యంత సరళమూ, శృంగార భరితమైన సాహిర్ లూధియాన్వీ పదాలు అందమైన భావనలను కలిగిస్తాయి. పాటలోని భావాన్ని ఇనుమడింపచేస్తూ ఎస్డీబర్మన్ సంగీతం, వాయిద్యాల కదలికలు మనస్సును మురిపిస్తాయి. 'నౌజవాన్' సినిమా ఎవరికీ అంతగా గుర్తుండదు.

ఈ సినిమాలో నళినీ జయవంత్, ప్రేమ్ నాథ్ లు నాయికా నాయకులన్న విషయం గుర్తుండకపోవచ్చు. కానీ 'ఠండా హవాయే' పాట మాత్రం ఈనాటికీ మండే హృదయాలకు శీతల లేపనం వంటిది. సినిమాలో ఇతర గీతాలు ఉన్నా 'ఠండా హవాయే' పాట మాత్రం మరపురాని పాటగా నిలుస్తుంది.

రొమాంటిక్ పాటలు రాయటంలో సాహిర్ మార్గం ప్రత్యేకం. అందరిలా రాయడు సాహిర్. సాహిర్ పాటలలో శృంగార భావం ప్రకృతితో మిళితమై ఉంటుంది. ప్రకృతి వర్ణన లేని శృంగార భావన సాహిర్ పాటలలో కనబడదు.

'యే రాత్ యే చాంద్‌నీ ఫిర్ కహా ' అంటాడు. 'జాల్ ' సినిమాలో. 'పర్వతొం కె పేడోంపర్, శాం క్ బసేరా హై ' అంటాడు 'షగున్ ' సినిమాలో.

'ఇన్ హ వోవోమే, ఇన్ ఫి జావోమే' అంటాడు 'గుమ్రాష్' సినిమాలో. ఇలా ఏదో ఓ రకంగా ప్రకృతి ప్రస్తావన, ప్రకృతి వర్ణన లేని సాహిర్ శృంగార గీతం ఉండదు. 'ఠండీ హవాయే ' పాట అందుకు భిన్నం కాదు. చల్లని గాలి వీస్తోంది. ఋతువు ప్రేమకు అనుకూలంగా ఉంది. ఇలాంటి సమయంలో నువ్వెక్కడ ఉన్నావు? నిన్ను ఎలా పిలవాలి? అంటోంది నాయిక. 'ఠండీ హవా' అన్నది సినీ గేయ రచయితలకు చాలా ఇష్టమైన ప్రయోగం

**ఝుక్తి ఘటా గాతి హవా సప్నే జగాయే**

**నన్హా  సా దిల్ మేరా మచల్ జాయే**

నీటి బరువుతో వొంగిన మేఘం, పాడుతున్న గాలి ఆమెలో కలలను జాగృతం చేస్తున్నాయి. ఆమె హృదయం చలించి పోతోంది 'ధూల్ క ఫూల్' సినిమాలో సాహిర్ రాసిన పాట ఇది.

**ఠండి హవా కాలిఘటా ఆయి గయే ఝూంకే**

**ప్యార్ లియే  డోలె హసీనా క జియా ఘూం కే**

'మిస్టర్ అండ్ మిసెస్ 55' సినిమాలో గీతాదత్ అత్యద్భుతంగా పాడిన ఈ పాట 'మజ్రూహ్' సుల్తాన్ పురి విరచితం. హుషారయిన పాట. మధుబాల అందంగా మందహాసం చేస్తూ చలాకీగా పాడే పాట ఇది. గీతాదత్ గొంతు పలికే చిలిపి తనం, హుషారు పాటను మరుపురాని పాటగా నిలుపుతుంది.

**ఠండి హవా యె చాంద్ నీ సుహానీ**

**ఏయ్ మేరే దిల్ సునా కొయీ కహానీ**

**లంబీ సి ఎక్  డగర్ హై జిందగాని**

'ఝుమ్రూ' సినిమాలో కిషోర్ కుమార్ ఎంతో ఆనందాన్ని అనుభవిస్తూ తన్మయత్వంతో పాడిన ఈ పాటను రచించింది మజ్రూహ్ సుల్తాన్‌పురి. ఈ పాటలో చల్లనిగాలిని, మనోహరమైన వెన్నెలను అనుభవిస్తూంటే అతని హృదయానికి కథ వినిపించాలని ఉందట. అందుకే హృదయాన్ని కథ వినిపించమంటున్నాడు.  జీవిత ప్రయాణ దారి చాలా దీర్ఘమైనది. ఈ ప్రయాణంలో దూరం తెలియకుండా ఉండేందుకు కథ వినిపించమంటున్నాడు. చక్కని ఊహ. అందమైన కవిత.

అయితే 'ఠండీ హవా' అందరిలో రొమాంటిక్ భావనలను కలిగించాలని లేదు. ప్రకృతి అలాగే ఉంటుంది. మనిషి తన మానసిక స్థితిని బట్టి ఆ ప్రకృతిని అనుభవిస్తాడు.

**జబ్ చలీ ఠండీ హవా, జబ్ ఉఠీ కాలీ ఘటా**

**ముఝ్ కొ ఏయ్ జానే వఫా తుం యాద్ ఆయె**

'దో బదన్' సినిమాలో ఆశాభోస్లే అత్యద్భుతంగా గానం చేసిన ఈ గీత రచయిత షకీల్ బదాయుని. 'ఆశా' పాడిన అత్యద్భుతమైన పాటల జాబితాలో ఉంటుందీ పాట. ఈ పాటకు బాణీని కూర్చింది రవి. ఆశా బోస్లేకు పేరు రావటంలో ఓపీ నయ్యర్ ప్రధాన పాత్ర పోషించాడని అందరూ అంటారు కానీ, రవి పోషించిన పాత్ర తక్కువేమీ కాదు. ఎవరూ గుర్తించకముందే ఆశాతో అత్యంత మనోహరమైన పాటలు పాడించాడు రవి. కానీ ఓ.పి నయ్యర్‌లా ఆశాకే అంకితం కాలేదు రవి. అందుకే రవి గురించి  అంతగా ఎవరూ ప్రస్తావించరు.

**సున్‌జా ఆ ఠండి హవో, థం జా ఏయ్ కాలి ఘటా**

**కుచ్ ప్యారి ప్యారి బాతే హమారీ, ఆ జాతే జాతే తూభీ సున్‌జా**

'హాథీ మేరే సాథీ 'లో ఆనంద్‌బక్షీ ఈ యుగళగీతం రాసేనాటికి ప్రేమలో 'ఎక్సిబిషనిజం' ప్రవేశించింది. అంత వరకూ నీలి మబ్బుకు, చల్లని గాలికి పరవశించి శృంగార భావనలు ఉద్దీపితమై ప్రేయసి కోసం ప్రియుడు, ప్రియుడి కోసం ప్రేయసి తపించిన రోజులు అంతమై, ఓ చల్లని గాలి, ఓ నీలి మేఘమా, మా ప్రేమ మాటలు అటూ ఇటూ వస్తూ పోతూ నువ్వూ వినిపో అంటున్నారు నాయికా నాయికలు. ఇటునుంచి బహిరంగ సామూహిక వ్యాయామ మాత్ర నృత్యాల ప్రేమ ఎంతో దూరం లేదు. నాయిక ఒంటరిగానో, నాయకుడితో కలిసో ప్రకృతిని చూసి పరవశించే రోజులు పోయి, అందమైన ప్రకృతి దృశ్యాల నడుమ వెర్రిగా పిచ్చి కదలికల గుంపుల నడుమ నాయికా నాయికలు గెంతుతూ, ప్రకృతిని విస్మరించి లైంగిక కదలికలను ప్రతిబింబించే నృత్య కదలికల ప్రదర్శననే 'ప్రేమ' అనే రోజులు వచ్చేశాయి. ఇలాంటి సందర్భాలలో సాహిర్ రచించిన 'ఠండీ హవాయే' పాట లత స్వరంలో వింటూంటే ఉపశమనంగా ఉంటుంది. ప్రేమ ఒక ఉన్మాదం, ఒక భీభత్సం కాని మధురమైన రోజులను తలచి మనసు మురిసిపోతుంది. మై మరచిపోతుంది.

**చాంద్ ఔర్ తారే హస్తే నజారే**

**మిల్ కే సభీ, దిల్ మే సభీ, జాదూ జగాయే.**

చిన్న చిన్న వాక్యాలు, లయ బద్ధమైన పదాలు వింటూంటే మనసు మైమరచిపోతుంది. చంద్రుడూ, నక్షత్రాలు, సంతోషాన్ని కలిగిస్తున్న ప్రకృతి దృశ్యాలన్నీ కలసి, హృదయంపై మంత్రం వేస్తున్న భావన కలుగుతోంది. 'మిల్‌కే సభీ, దిల్‌మే సభీ' అత్యంత మనోహరమైన ప్రయోగం.

**కహా భీ న జాయే, రహాభీ న జాయే**

**తుం సె అగర్, మిలేభీ నజర్, హం ఝూమ్ జాయే.**

చెప్పను, చెప్పకుండా ఉండలేను. నీతో కళ్లు కలసిన తరువాత నేను తన్మయురాలనై మైమరచి పోతానేమో! 'ఝూమ్' అంటే గాఢమైన నిద్ర. క్రియ వాచకం అయితే 'నిద్రపోవటం'. ఇక్కడ 'నిద్రపోవటం' అన్న అర్ధం కన్నా మత్తు, తన్మయత్వం వంటి అర్ధాలే సందర్భోచితంగా ఉంటాయి. యువతి యువకుల కళ్లు కలసినప్పుడు ఓ రకమైన మత్తు, తన్మయత్వంతో కళ్లు బరువెక్కుతాయి. నిద్రలాంటి మత్తు ఆవహిస్తుంది. తొలి ప్రేమలో ప్రధమంగా కళ్ల కలయికలో ఇది సాధారణం. ఈ అత్యద్భుతమైన భావనను వర్ణిస్తున్నాడు సాహిర్. స్వేచ్ఛ, శృంఖలాల ఛేదన వంటి నినాదాల వల్ల జీవితంలో కోల్పోయిన మాధుర్యాన్ని, అడ్డు అదుపులేని స్త్రీ, పురుష కలయికల వల్ల, ప్రధమ వీక్షణంలోని మృదుత్వం, మౌగ్ద్యం ఆవిరయిన చేదు నిజాన్ని తలపుకు తెస్తుందీ పాదం.

**దిల్ కే ఫసానే, దిల్ భీ నజానే**

**తుం కో సజన్, దిల్ కీ లగన్ కైసే బతాయె**

'ప్రేమ'ను బజారులో అమ్మే గ్రీటింగ్ కార్డు స్థాయికి దిగజార్చటం వల్ల సున్నితమైన శృంగార భావనలు జీవితాల్లోంచి అదృశ్యం అయిపోయాయి. హృదయపు గాథలు హృదయానికే తెలియవు. మదిలో కలిగే భావనల స్వరూపం, చెలరేగే స్పందనల రూపం హృదయానికే అర్థం కావు. అలాంటి పరిస్థితులలో తనలో తనకే అర్థంకాని సున్నిత భావనలు చెలరేగుతున్న సమయంలో హృదయం అతనిపై స్థిరపడటాన్ని అతనికి ఎలా తెలపటం? అంటే, అతడి పట్ల తనలో చెలరేగుతున్న భావనల స్పష్టమైన స్వరూపం తనకే అర్థం కావటం లేదు. ఇక అతనితో హృదయ భావనల సంగతి ఏం చెప్తుంది?

ఈ పాటకు నళినీ జయవంత్ అత్యంత సుందరంగా భావనలను వదనంలో ప్రతిఫలిస్తుంది. నళినీ జయవంత్ స్వయంగా పాటలు పాడగలదు. కానీ తన రూపానికి లత స్వరం ఎంతగానో నప్పటంతో ఆమె తనకు పాటలు లతనే పాడాలని నియమం విధించింది. ఇది చూసి మధుబాల, నిగర్ సుల్తానా వంటివారు కూడా కాంట్రాక్ట్‌లోనే తమ పాటలు లత పాడాలన్న నియమం విధించేవారు. ఆ రకంగా హిందీ సినీ నాయకల స్వరంలా లత ఎదిగింది.

'ఠండీ హవాయే' పాట ఎంతగా ప్రజాదరణ పొందిందంటే, పలు ఇతర సంగీత దర్శకులు ఈ బాణీతో ప్రేరణ పొంది పాటలను సృజించారు.

1952లో వి. నాగయ్య, తమిళ సినిమా 'థాయ్ ఉల్లం'లో ఎం.ఎల్ వసంత కుమారితో 'కాంజుం పురావే' అనే పాటను రూపొందించాడు. 1954లో రోషన్ 'చాంద్నీ చౌక్' సినిమాలో 'తెరా దిల్ న్ హో హై' అనే పాటను ఆశాభోస్లేతో 'ఠండీ హవాయే' బాణీలోనే పాడించాడు. 1964లో మదన్ మోహన్ 'ఆప్ కే పర్ఛాయియాన్' సినిమాలో రఫీతో 'యహీ హై తమన్నా' అనే పాటను 'ఠండీ హవాయే' పంథాలోనే రూపొందించాడు. 'చాంద్నీ చౌక్ ' పాటతో సంతృప్తి లభించని రోషన్, మళ్లీ లతాతో 'ఠండీ హవాయే ' బాణీలోనే 'రహే న రహే హం ' అనే అత్యద్భుతమైన పాటను పాడించాడు. సినిమాలో ఈ పాటను రఫీ, సుమన్ కళ్యాణ్ పుర్ యుగళగీతంలా కూడా పాడతారు. ఆ సమయంలో లత, రఫీతో పాడేది కాదు. అందుకని సుమన్, రఫీతో పాడింది.

ఇంతటితో ఈ పాట ప్రేరణ ఆగిపోలేదు. 1976లో ఎస్డీ బర్మన్ తనయుడు ఆర్డీ బర్మన్ 'బండేల్ బాజ్' సినిమాలో 'నగ్మా హమారా' అనే పాటను లత, రగీలతో 'ఠండీ హవాయే' బాణీలోకి పాడించాడు. 1979లో బాసు చక్రవర్తిలు, మనోహరి సింగ్‌లు, యేసుదాస్, లతలతో 'బిన్ బాప్ కే బేటే' అనే సినిమాలో 'దోనో కా దిల్ హై' అనే పాటను 'ఠండీ హవా'కు ప్రతిబింబంలా తీర్చిదిద్దారు. 1981లో మళ్లీ ఆర్డీబర్మన్ 'ఠండీ హవాయే' 'నరం గరం' సినిమాలో 'హం రాస్తోంకే జరూరత్ హై' అనే పాటను ఆశాతో పాడించాడు. 'నరం గరం' పాట అనుకున్నంత ఆదరణ పొందకపోవటంతో 'అగర్

తుం న హోతే ' సినిమాలో కిషోర్‌తో, లతతో వేరువేరుగా ఇదే బాణీతో 'హమే ఔర్ జీనేకీ' అనే పాటను సృజించాడు ఆర్డీ బర్మన్. అంతటితో సంతృప్తి కలగలేదు ఆర్డీబర్మన్‌కు. 1985లో 'సాగర్' సినిమాలో 'లత, కిషోర్‌లతో 'సాగర్ కినారే' అనే పాటనూ 'ఠండీ హవాయే ' బాణీలోనే రూపొందించాడు. 1983లో రాం లక్ష్మణ్ 'ప్యార్ కా తరానా' సినిమాలో 'కహాథా జోతుంనే' అనే పాటను 'ఠండీ హవాయే ' బాణీలోనే రూపొందించాడు. ఒక దీపంతో కొన్ని వేల దీపాలు వెలిగించవచ్చన్నట్టు ఒక్క బాణీ కొన్ని దశాబ్దాలుగా ఇంతమంది సంగీత దర్శకులకు ప్రేరణగా నిలచింది.

1951లో సాహిర్, ఎస్డీ బర్మన్, లతల వల్ల వీచిన 'శీతల పవనం' ఈనాటికీ తరతరాలుగా శ్రోతలను ముగ్ధులను చేస్తోంది. తరతరాలుగా కళాకారులకు ప్రేరణగా నిలుస్తోంది. ఉత్తమ కళ ప్రధాన లక్షణం ఇది. మంచి మంచినే పెంచుతుంది.

**వచ్చే నెల మరిన్ని మధురమైన గీతాలతో...**

Post your comments